సన్నటి లోహ మార్గంలోకి దూరిన రామ కోటి మొహానికి వేడిగాలి వెచ్చగా తగి లింది.

శరీరాన్ని సన్నని ఆ ఇరుకు మార్గంలో నుండి నెట్టుకుంటూ నెమ్మది నెమ్మదిగా... నిశ్శబ్దంగా ముందుకు జరుగుతున్నాడు అతను. అతని దగ్గర ఉన్న సమాచారం ప్రకారం సేఫ్ మొదటి అంతస్తులో ఉంది.

ఇంతలో అతను వెళ్తున్న మార్గం కిందకు మరలింది. ఒడుపుగా శరీరాన్ని కూడా దిశ మార్చి కిందకు దించటం మొదలుపెట్టాడు. ఇప్పుడు అతని శరీరం పూర్తి తలక్రిందులుగా ఉంది. చేతులతో ఇరుపక్కలా ఉన్న గోడలను బిగించి పట్టు కుని కిందకు జారాడు. తిరిగి మార్గం బల్ల పరుపుగా మారింది.

'మొదటి అంతస్తులోకి వచ్చాను...' అనుకున్నాడు అతను.

బయలుదేరటానికి ముందు చూసిన ఆ ఇంటి ప్లానుని కళ్ళముందు ఊహించు కుంటూ సేఫ్ ఉందనుకున్న ప్రదేశానికి జరుగుతున్నాడు.

తనకు కావలసిన ప్రదేశం వచ్చింది... అనుకున్న తరువాత, తను వెళుతున్న మార్గంలో ఉన్న రేకులు జాయింట్ చేసిన ప్రదేశంలో ఉన్న స్క్రూలు విప్పాడు.

ఏర్పడిన చిన్న సందు నుండి కింద ప్రదేశాన్ని గమనించాడు. కింద రూమ్ ఖాళీగా ఉంది.

రేకుల మధ్య ఏర్పడిన ఖాళీని మని షిపట్టే అంత పెంచి... రూమ్‌లోకి ఫాల్స్ సీలింగ్‌కి రంధ్రం చేసి... కింద కనిపి స్తున్న రూమ్‌లోకి నిశ్శబ్దంగా జారాడు.

ఆ రూమ్‌లో లైటు వెలగటం లేదు. అయినా బయటనుండి పడుతున్న మసక వెలుతురుకు వస్తువులన్నీ స్పష్టంగానే కని పిస్తున్నాయి. రూమ్‌లో ఒక మూల కని పించింది అతనికి కావలసిన సేఫ్.

కింది అంతస్తు నుండి ఇద్దరు మను షులు మాట్లాడుకుంటున్న సంభాషణ విని పిస్తోంది. అందులో ఒక గొంతు బాగా ఆవేశంగా ఉంది.

దానిని పట్టించుకోకుండా సేఫ్ వైపు నడి చాడు రామకోటి. దానిని పరిశీలించి చూశాడు.

అది అప్పటివరకూ తను చూసిన ఏ సేఫ్‌లానూ లేదు.

బయోమెట్రిక్ పద్ధతిలో... కేవలం ఉద్దే శించిన వ్యక్తి చేత మాత్రమే తెరవబడే ఎలక్ట్రానిక్ సేఫ్ అది!

అది ఎలా పనిచేస్తుందో... దానిని ఎలా తెరవాలో రామకోటికి అర్థం కాలేదు.

ఎలాంటి ఇనస్పెక్టైనయినా తెరవగల నన్న అతని ఆత్మవిశ్వాసం సడలిపో యింది.

అంత చల్లని వాతావరణంలో కూడా అతని నుదుటిపై చెమట బిందువులు ఏర్పడసాగాయి.

కింద నుండి వినిపిస్తున్న మాటలు స్వరం పెరిగి వాదనలోకి దిగి ఘర్షణగా మారుతున్నాయి.

సమయం గడిచిపోతుంది.

రామకోటిలో నిర్వేదం పెరిగిపోతుంది.

ఇంతలో హఠాత్తుగా కింద నుండి ఒక వ్యక్తి విసవిసా పైకి వస్తున్నట్లు అడుగుల శబ్దం వినిపించింది.

చప్పున అలర్ట్ అయ్యాడు రామకోటి. చుట్టూ చూసిన అతనికి కర్టెన్లు తప్ప మరేమీ కనపడలేదు దాక్కోవటానికి.

చురుకుగా కదిలి పరదాల చాటుకు చేరుకున్నాడు.

ఇంతలో తలుపు తెరుచుకుని... నైట్ గౌన్ వేసుకున్న ఒక వ్యక్తి ఆవేశంగా లోప లకు వచ్చాడు. అటూ ఇటూ చూడకుండా సరాసరి సేఫ్ వద్దకు నడిచి అంతవరకూ రామకోటికి కనపడని బటన్ ఏదో నొక్కాడు.

సేఫ్‌లో నుండి నీలిరంగు కాంతి కిరణం వెలువడింది. అతను తన కంటిని ఆ కిర ణానికి ఎదురుగా ఉంచాడు. ఆ కిరణం అతని కళ్ళని స్కాన్ చేసిన అనంతరం ఆటోమాటిక్‌గా సేఫ్ తలుపు తెరచు కుంది.

సేఫ్‌లో నుండి పిస్టల్ బయటకు తీసి... అదే వేగంతో వెనుతిరిగి గది బయటకు వెళ్ళిపోయాడు అతను.

ఆ ఆవేశంలో సేఫ్ మూయలేదు.

అదే అవకాశంగా రామకోటి వేగంగా సేఫ్ వద్దకు వెళ్ళి లోపలకు చూశాడు.

అతను తీసుకు వెళ్ళవలసిన ఎర్ర బాక్సు కనిపించింది. అది అతను ఊహించినదా నికన్నా చాలా చిన్నదిగా ఉంది. బంగారు ఆభరణాలు పెట్టే బాక్సులాగా ఉంది అది. దాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

ఇంతలో కింద నుండి 'దబ్'మన్న శబ్దం, నిశ్శబ్దంలో గట్టిగా వినిపించింది.

ఎవరో బాధతో అరచిన అరుపు మరింత పెద్దగా వినిపించింది.

రామకోటి త్వరత్వరగా బయటకు వచ్చాడు.

బయట కారిడార్ నిశ్శబ్దంగా ఉంది. దూరంగా కారిడార్ చివర డాబా మీదకి వెళ్లే మెట్లు కనిపించాయి.

చిరుతలాగా వేగంగా పరుగెత్తుతూ మెట్లను చేరుకుని పైకి ఎక్కసాగాడు. మెట్లపైన డాబా మీదకు వెళ్ళే తలుపు తాళం వేసి ఉంది. అయితే దాన్ని తియ్యటం అతనికి పెద్ద కష్టమేమీ కాలేదు. కొన్ని క్షణాల్లోనే తలుపు తెరచు కుంది.

ఇంతలో ఎవరో పరుగెత్తుతూ మెట్లవైపు వస్తున్న శబ్దం వినిపించింది.

రామకోటి తలుపు తీసుకుని డాబా మీదకు వెళ్ళి... కొడుకుని నిలబడి ఉండ మని చెప్పిన వైపు చూశాడు.

అక్కడ పాండు లీలగా కనిపించాడు.

చేతిలోని బాక్సు కొడుకు వైపు విసిరివే

శాడు.

అతను బాక్సు విసిరివేసిన మరుక్షణం డాబా తలుపు తెరుచుకుని ఎవరో పైకి వచ్చిన శబ్దం అవటంతో వెనుతిరిగి చూశాడు.

ఎవరో ఒక వ్యక్తి చేతిలో పిస్టల్ పట్టుకుని నిలబడి ఉన్నాడు.

అతను సేఫ్‌లో నుండి పిస్టల్ తీసుకువెళ్ళిన వ్యక్తి మాత్రం కాదు.

"చేతులు పైకి ఎత్తి కిందకు పద!... ఏ మాత్రం పిచ్చివేషాలు వేసినా ప్రాణాలు పోతాయి..." అన్నాడు అతను.

అతని కళ్లలోని తీక్షణత చూస్తే అన్నంత పనీ చేసేటట్లే కనిపించాడు.

చేసేదేమీ లేక రామకోటి అతను చెప్పినట్లే చేస్తూ... కిందకు నడిచాడు.

★ ★ ★

బయట ఎదురుచూస్తున్న పాండుకి తన తండ్రి పరుగెత్తుకుంటూ మేడ మీదకు వచ్చి తన వైపు ఏదో విసిరివెయ్యటం కనిపించింది.

చీకట్లో దూసుకువస్తున్న ఆ వస్తువు వైపు అనియంత్రితంగా చేతులు చాచాడు అతను.

సరిగ్గా వచ్చి చేతుల మధ్య ఇరుక్కుంది బాక్సు.

కళ్లు తిప్పి తిరిగి మేడ మీదకు చూసేటప్పటికి అక్కడి పరిస్థితి మారిపోయి ఉంది.

ఎవరో ఒక వ్యక్తి తన తండ్రిని బలవంతంగా తిరిగి ఇంటిలోకి తీసుకువెళ్తున్నాడు.

ఒకవేళ తను పట్టుబడితే... తన గురించి ఎదురు చూడకుండా, అక్కడి నుంచి వెళ్లిపోమన్న తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి పాండుకి.

అయితే చేతిలో ఉన్న బాక్సును ఏమి చెయ్యాలి?

బాజీరావుని నమ్మి దానిని అతనికి ఇచ్చేస్తే తరువాత తండ్రి పరిస్థితి ఏమిటి?

ఆలోచించటానికి ఎక్కువ సమయం లేదు. తనకు తోచిన నిర్ణయం వెంటనే తీసుకున్నాడు పాండు.

ఒక పెద్ద రాతికింద గుంట చేసి బాక్సును దానిలో పాతిపెట్టి రోడ్డు మీదకు బయలుదేరాడు.

అతను రోడ్డు మీదకు వచ్చేలోపు బిల్డింగ్ లోపల నుండి పిస్టల్ పేలిన శబ్దం వినిపించింది. అతనికి లోపల ఏమి జరుగుతుందో అర్థం కాలేదు. తను అక్కడ ఉండాలో... వెళ్లిపోవాలో కూడా అర్థం కావటం లేదు.

కాసేపటికి బిల్డింగ్ నుండి పెద్దపేలుడు వినిపించింది.

ఇక ఆలోచించకుండా వేగంగా రోడ్డు చివరకు అడుగులు వెయ్యబోయిన అతని భుజంమీద ఒక చెయ్యి పడింది.

ఉలిక్కిపడి వెనుకకు తిరిగి చూసిన అత నికి బాజీరావు కనిపించాడు.

"బాక్సు ఎక్కడ? " ఆత్రుతగా అడిగాడు అతను.

"ఏమి బాక్సు? " ఏమీ తెలియనట్లు ఎదురు ప్రశ్నించాడు పాండు.

"నాటకాలాడకు? మీ నాన్న నీకు ఏమీ ఇవ్వలేదా? ..."

"మా నాన్న ఇంకా బయటికే రాలేదు. నాకెలా ఇస్తాడు? "

బాజీరావు ఆలోచనలో పడ్డాడు.

దానితో తన తండ్రి తనకి బాక్సు ఇచ్చిన విషయం అతనికి తెలియదని అర్థం అయింది.

"మీరిద్దరూ కలిసి నన్ను మోసం చేద్దా మనుకుంటున్నారేమో! ఇద్దరినీ నాశనం చేస్తాను. మర్యాదగా చెప్పు! మీ నాన్న నీకేమీ ఇవ్వలేదూ? .."

పాండు సమాధానం చెప్పేలోపు సైరన్ మోగించుకుంటూ పెట్రోలింగ్ వాహనం అటు వచ్చింది. అది వేగంగా పేలుడు జరిగిన బిల్డింగ్‌వైపు వెళ్తుంది.

రోడ్డుమీద వీరిద్దరినీ చూసిన పోలీసు వాహనం అక్కడే ఆగింది. దానిలో నుండి ఒక పోలీసు ఆఫీసరు కిందకు దిగాడు.

"ఎవరు మీరు? " అధికార దర్పం గొంతులో ఉట్టిపడుతుంటే అడిగాడు అతను.

మఫ్టీలో ఉన్న బాజీరావును పోలీసుగా అతను గుర్తించలేదు.

బాజీరావుకి ఏమి చెప్పాలో అర్థం కాలేదు.

ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలో ఉండవలసిన తను ఇక్కడ ఎందుకు ఉన్నావంటే? ఏమి సమాధానం చెప్పాలి.

అందుకే ముందు నేరం అందుబాటులో ఉన్న పక్కవాడి మీదకు తోసేస్తే తరువాత సంగతి తరువాత చూసుకోవచ్చు.. అని అనుకున్నాడు.

వెంటనే స్టిఫ్‌గా సెల్యూట్ చేసి చెప్పాడు - "నేను మఫ్టీలో ఉన్న. సీ.ఐ.ని సర్! వీడు పెద్ద దొంగ. మా ఊర్లో దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. వీడిని పట్టుకోవటం కోసం ఇక్కడకు వచ్చాను. లక్కీగా దొరికాడు... తీసుకు వెళ్తు న్నాను..."

"నీ ఐడి ఏది? "

చూపించాడు బాజీరావు.

ఆ ఆఫీసరు మరింకేదో అడగబోతున్నం తలో... ఫైరింజన్లు ఆ వీధిలోకి ప్రవేశిం చాయి.

అతనికి జరిగిన పేలుడు సంగతి గుర్తుకు వచ్చింది. "సరే... సరే..." అంటూ జీపు ఎక్కి కూర్చున్నాడు.

జీపు పేలుడు జరిగిన బిల్డింగ్‌వైపు వెళ్లి పోయింది.

బాజీరావుకి పాండుని దొంగగా కోర్టులో ప్రవేశపెట్టక తప్పని పరిస్థితి ఎదుర యింది.

జరుగుతున్న పరిణామాలూ, ఏం జరి

గిందో తెలియని తండ్రి పరిస్థితి కలిసి పాండును అయోమయంలోకి నెట్టివేశాయి.

★ ★ ★

పాండు తేరుకునేటప్పటికి అతను కోర్టులో దొంగగా ప్రవేశపెట్టబడ్డాడు.

అతని మీద ఏవో నేరాలు ఆరోపించబడ్డాయి.

అవేమిటో కూడా అతను పట్టించుకోలేదు.

అతనికి వ్యతిరేకంగా ఎవరెవరో సాక్ష్యాలు చెప్పారు.

వారెవరో అతను గమనించనే లేదు.

మధ్య మధ్యలో అతని తల్లివచ్చి కలిసేది.

రెండు మూడుసార్లు బాజీరావు కూడా వచ్చి బాక్సు గురించి మరీ మరీ అడిగి వెళ్లాడు.

అయితే ఎవరికీ అతని తండ్రి గురించి మాత్రం తెలియదు.

మరి తన తండ్రి ఏమయ్యాడు.?

పోలీసులకు పట్టుబడలేదు.

ఒకవేళ పేలుడులో చనిపోయాడా? చనిపోయింది వేరే వ్యక్తి అని పోలీసులు ప్రకటించారు కదా! తన తండ్రి కూడా చనిపోయి ఉంటే శవం దొరకాలి కదా!

బాజీరావు తన తండ్రిని ఏదైనా చేసి ఉంటాడా?

ఆ బాక్సు దొరకనంత వరకూ అతను తన తండ్రిని చంపడు.

కాబట్టి తన తండ్రి బతికే ఉండి ఉండాలి. అలా అయితే మరి అజ్ఞాతంలో ఎందుకు ఉంటున్నట్లు? కనీసం తన తల్లినయినా ఎందుకు కలవలేదు?

ఎంత ఆలోచించినా అంతకంటే పాండు ఆలోచన ముందుకు సాగటం లేదు.

ఈ చిక్కుముడి బహుశా తను జైలు నుండి బయటపడితే తప్ప విడిపోదేమో!

అలా పాండు తన ఆలోచనలలో కొట్టుమిట్టాడుతున్నపుడే విచారణ పూర్తి అయింది. పాండుకి మూడేళ్ళు శిక్ష పడింది.

దూరంగా ఉన్న ఈ సెంట్రల్ జైలుకి తరలించ బడ్డాడు.




**వా**న ఎప్పుడు తగ్గిపోయిందో గమనించనే లేదు పాండు.

తన ఆలోచనల నుండి తేరుకునేటప్పటికి ఆకాశం నిర్మలంగా ఉంది. మబ్బుల చాటునుండి బయటపడిన సూర్యుడు శక్తినంతా పుంజుకుని ప్రతాపం చూపటం మొదలుపెట్టాడు.

కారిడార్లో సెంట్రీ పాండు సెల్ ముందు ఆగాడు.

తలుపు తాళం తీస్తూ - "వార్డెన్‌గారు అర్జంటుగా పిలుచుకు రమ్మన్నారు..." కారణం చెప్పాడు.

పాండు బయటకు రాగానే సెల్ తలుపు మూసి తాళం వేశాడు.

వార్డెన్ దగ్గర పాండుని హాజరుపరచి సెల్యూట్ చేశాడు సెంట్రీ.

అతన్ని వెళ్ళవచ్చు అన్నట్లు సైగ చేశాడు వార్డెన్.

సెంట్రీ బయటకు వెళ్లిపోయాడు.

వార్డెన్ తన ఎదురుగా ఉన్న ఫైల్ మూసేశాడు. ఫైలు మీద పేరును బట్టి